# ఆగష్టు 15 న

ఒక సంవత్సరంలో నిన్నటివరకూ నేనూ బానిసనే. ఏ సంవత్సరంలోనో నేటినుండీ నేను స్వతంత్రుణ్ణట!

ఔను! కాదనేందుకు నాకు స్వాతంత్ర్యం లేదు.

'నల్ల' పిల్ల నా కళ్ళకు కన్పించింది. నల్లపిల్లని కన్న రోజుల దారి వేరు. ఆ రోజుల్లో కాలుగాలిన పిల్లిలా తిరిగేందుకు వీలుండేది; పనిలేని మంగలి కన్పించేవాడు కాదు. పదిమంది దారికి అడ్డం వెళ్ళి 'ఏమిటి? ఎందుకు? ఎట్లా?' అని అడిగితే జాబులో, జవాబులో ఖరాబైన మొఖాలో, రక్తం విరిగిన ఆకారాలో....కన్పించేవి.

నాకేమీ కన్పించలేదు! నవ్వే పువ్వులూ, నడిచే మనుష్యులూ, పాడే పక్షులూ, చదువుకున్న ముఖాలూ, తోటలో వసంతమూ, కడుపులో ఏదీ — ఒక్కటీ కన్పించలేదు.

విస్తుపోయాను.

"ఏమిటి!" అందాం అనుకున్నాను. వెనక నిలబడ్డ ఖాకీలాగు గరగరమంది. "ఎందుకు?" అందామా ఎర్రటోపి కరుస్తుంది.

"ఎట్లా?" అంటే "ఏం?" అంటే నాకైనా వాళ్ళని బ్రదికుండగా చూచేందుకు వీలుంటుందో వుండదో—

బుర్ర వేడెక్కింది. నిద్ర పట్టలేదు. తలంతా దిమ్మె త్తింది. కనుబొమ్మలు కంపించాయి; కలసిపోతవేమోననిపిం చింది. శరీరమంతా మాట్లాడాలని బాధ పడుతున్నా మూగ వాడులా మెలికలు తిరిగింది. మెడ జిమ్మున లాగింది. శరీర మంతా చెమటలు కక్కింది; మండుతూన్న చలిమంటలాగ బుగబుగలాడింది. గొంతు తడి ఆరిపోయింది. పచ్చి వెల క్కాయ మ్రింగుడు పడకుండా గొంతులో ఇరుక్కున్నట్ల యింది. మసలుతూన్న మనుష్యుల మాటలు జ్వరం ఉధృ తంతో, మగత బాధపడుతూన్న మనిషికిలా వినిపించాయి కుడి కన్ను అదిరింది. బజారున పడ్డాను.

స్వాతంత్ర్యదినం! శెలవు!

కొట్టుమీదా, కాఫీ హోటళ్ళమీదా జండాలు ఎగురుతున్నాయి. మనుష్యులు కన్పించలేదు. బజారంతా మరుభూమిలాగుంది. అక్కడకూడా_యెక్కడ చూచినా_ ఎర్రటోపీలు 'భో' అంటున్నాయి. నాకు భయమేసింది; పరు గెత్తాను.

కళ్ళముందు చీకటి వుంగరాలు తిరిగాయి. చుక్కల్లేని ఆకాశం నన్ను నిలేసింది. "ఎక్కడికి?" అని వురిమింది. ఉరి మింది వుర్వో, వియత్తో? నాకు కనిపించిన నేల నాలుగు చెర గులూ మా యింటి ముందున్న వ్యాపారి పొట్టను కప్పి పై కుబికాయి? పొట్ట లేచింది. పొట్ట అడుగున వున్న చీకటి అరచింది. "ఎక్కడికి?"

నేను తెల్లముఖం వేశాను. నిజంగానే "ఎక్కడికి?"

పొట్ట కదిలింది. పొట్టమీద ఇనుపచువ్వల మొనలు మొలిచాయి. మొనలమధ్య నడిబొడ్డు ద్వారం విచ్చుకుంది. ద్వారం వెనుక పేగుల నిచ్చెనలూ, ఎముకల మెట్లూ, చూస్తే చికాకు వేయలేదు! మెట్లుదిగిన నర్తకీ సమూహం; నగ బృందం. బృందం ఆభరణం మొలత్రాడు. మొలత్రాటి బిళ్ళలు రూపాయలు, ఘల్లుమన్నది మొలత్రాడు; రొమ్ము వంపులు తిరిగింది. జఘనం సుళ్లు తిరిగింది. తలలేని బృందం తైతక్కలాడింది. చీకటి వెనుక కారుచీకటి. కారుచీకట్లో తారట్లాడుతున్నవి టోపీలూ, లాఠీలూ, బాయొనెట్లూ, తుపాకులూ; ఇనుప సూటూ.

"ఏమిటది?" అందాం అనుకున్నాను. కనపడని కాలు ఒక తన్ను తన్నింది. ఇనుప చువ్వల మొనలు రాక్షసి గోళ్ళల్లా విచ్చుకున్నవి.

"ఎందుకు?" అనబోయాను. మరఫిరంగి "ఢాం" అంది. ఆ అదురుతో నదిరి యినుప చువ్వల కొనల రాక్షసి గోళ్ళకి అందనంత దూరంగా వెనక్కి పడ్డాను.

ఇబ్సన్ జ్ఞాపకం వచ్చాడు; స్వతంత్రుడు బురదలో దొర్లకూడదు. తన ముఖంమీద తానే వుమ్మేసుకునేట్లుగా ప్రవర్తించకూడదీ స్వతంత్రుడు.

అరచేతులు వెనక్కి త్రిప్పి వేళ్ళమీద కాళ్ళు చాచి, వెన్ను వెనక్కి వంచి నేలమీద కూర్చోబోయాను. "ఢాం!" అన్న మరఫిరంగి నిప్పురవ్వలు తృటిలో మెరిశాయి. గుడ్డలు లేని ఆడవాళ్ళు మానాన్ని చేతుల చాటున దాచుకుంటూ,

జారిపోయిన గౌరవాన్ని, వూడిపోయిన సిగ్గునీ చేతులతో రొమ్ముల కదుముకుంటున్నారు. గోచీల్లేని మగవాళ్లు విడి పోయిన గుప్పెట్లతో ముందుకువచ్చే ముప్పట్లో తలలొంచి, మోకాళ్లు మడిచి కళ్ళల్లో శూన్యాన్నీ, గగనాన్నీ చూచు కుంటున్నారు. పసివాళ్లు నోళ్ళల్లో వేళ్లు పెట్టుకొని చీకు తున్నారు; ముసలివాళ్లు మోకాళ్ళలో యిరికించుకుని డొక్క లదిరేటట్లు వెక్కి వెక్కి యేడుస్తున్నారు...

ఆడవాళ్ళనీ, మగవాళ్ళనీ, పసివాళ్ళనీ, ముసలివాళ్ళనీ కక్కిన మరఫిరంగి మాయమైనది. ఫిరంగి పునాదులు సలసల మన్నవి. చమురులేని నెత్తురు బుడగలు కొట్టుకుంటూ ప్రవ హిస్తోంది. చివరల్లేని నిచ్చెనల చివర సిగ్గూ, శరమూ, చీమూ, నెత్తురూ,......

ఉరిమింది ఉర్వో, వియత్తో! "నేను నీవాడ!" నాకు పేగులు తోడినట్లయ్యింది. రూపులేని తాలుపు తల, మెడ లెనక్కి వంచి పైకి చూచినా కన్పించలేదు. పొట్టలో అలలు పెరిగినయి; పొట్ట నవ్వింది. ప్రక్కనున్న కొండలు కదలినై. తలలేని మొల నన్ను తరిమింది.

పరుగెత్తాను, గుండెలదిరేటట్టు; కాళ్ళరిగేట్టు...ఆడ వాళ్లూ, పసివాళ్ళూ; ముసలివాళ్లూ నా వెంట బడ్డారు, నా వెన్నంటారు. నన్ను వేటాడతారేమోనని భయం వేసింది. గుండెలదిరినా, కాళ్ళరిగినా నిలబడాలనుకున్నాను; నిలబడలేక పోయాను; గాలి పీల్చలేకపోయాను. వాళ్ళ వెనక నడిచే తలలేని మొల నాక్కనిపిస్తుందేమో!

(7)

వెనుతిరిగి చూడలేదు; పరుగెత్తాను. ముందుకే... భవిష్యత్తులోకి!

నా ముందు ఒక నీడ కదిలింది. నీడ వెనుక నీడలు కదిలాయి. ఎవరివి యీ నీడలు? భవిష్యత్తులో కదిలే యీ నీడలు ఎవరివి? ఎందుకీ వూరేగింపు?

"ఎవరు?"

హోవార్డ్ ఫాస్ట్! శీతాకాలంలో 'జెర్సీ' తొడుక్కున్నట్లయినది. శరీరమంతా విశ్రాంతిని తొడుక్కుంది: నన్నూ శాంతినీ కలిపి కుట్టేశాడు!

"నిన్ను జైల్లో పెట్టలా! బయటపడి భవిష్యత్తులోకెట్లా వచ్చావు? ఎందుకీ వూరేగింపు?"

"ప్రాణహానికన్నా దుస్సహం మానహాని!" పలికాయి వెనుకనున్న నీడలు; నడిచే నీడలు.

ఫాస్టు పెదవులు విప్పాడు. అక్షరాలు దొర్లాయి. దొర్లిన అక్షరాలు మాటల్ని మార్చాయి. మార్చిన మాటల వెనుక నిలబడిందొక పెద్ద మాట. "ఫ్రీడమ్" ... హక్కువుంది; నాకు హక్కున్నది. బానిసత్వంలో బ్రతికే కంటే చావటమే మెరుగు. నా హక్కులన్నీ లాక్కున్నావ్. చచ్చే హక్కుని లాక్కోలేవ్!...

విస్తుపోయాను చస్తానా?

ఫాస్టు పెదవికదిపాడు. మానవులు పంక్తులు తీరారు. మొదలున్న పంక్తికి చివర కన్పించలేదు. చివరిలో భవి

మృత్తు! పంక్తుల్లో నీడలు కదిలాయి. కదిలే నీడలు కత్తులు దుచ్చుకున్నాయి.

ఫ్రీడమ్ పగిలింది. పగుల్లో పర్వతం నిలిచింది. యోజనాల యెత్తుమీద నిలబడిందొక మొండెం కాలు. మొన కదిపితే యోజనాల లోతుల్లోకి జారిపోతుంది. లోతుల అడుగున పారుతోంది చీకటి సంద్రం. సముద్రం ఘోషలో 'బిక్కు-బిక్కు'ల పెల్లులు విరిగిపడుతున్నాయి.

"బ్రదుకుతున్నావా?"

"ఆహా!" అన్నది మొండెం.

చీకటి "ఘొల్లు" మంది. కత్తవననిచే కాలుమీద కూర్చున్న దొక తల.

"ఏం?" అన్నాను దాంతో.

తలలో కళ్లు మెరిశాయి. ముందుకు చూచే కళ్ళల్లో వెనక కన్పించింది. వెనక్కి జారగిలబడి కూర్చుందొక ముది.

"ఏమిటి?"

"నా బిడ్డ!" అన్నది ముది చేతులు కదుపుతూ. కదిలే చేతుల అరచేల్లో నెత్తురు కార్చే కండ.

"ఎందుకు?"

మాట్లాడని ముది, పడి పేరుకున్న నెత్తురుబొట్టు వైపు వంగింది. బొట్టులో పుట్టే జనం బారులు తీరింది!

"ఇంకేం?"

"ఉన్నది ఒక్కటే" అన్నది ముది. అసంతృప్తి! ఎన్ని కావాల్సోయి లా అయ్యే ఒక్కటులు! ఈ ముదికి!

కత్తవననచే కాలుమీద కూర్చున్న తల నడిగాను. ఫ్రీడమ్‌లో మొదటి సున్నా యేమైంది?

తల చూచిన దిక్కుకు చూచాను. మొదటి సున్నా వుంగరమై గింగిరాలు తిరుగుతోంది. గింగిరాల్లో నిలబడ్డ మొండెం తలక్రిందైంది. తలక్రిందైన మొండెమూ, గింగరాలు తిరిగే వుంగరమూ అల్లంత దూరాన అదృశ్యం అయ్యాయి.

"మిగిలిందేమిటి?"

"ఫ్రీడమ్!" అన్నది తల.

"ఏమిటి?"

"రక్తాక్షరాలు!" అన్నది తల. పారే సెలయేటి మీద తేలే రాబ్సన్ ఆలపించాడు. "రక్తాక్షరాలు!" పెరుగుతూన్న పర్వతాలు. ప్రతిధ్వనించాయి రక్తాక్షరాలు!

నా వెనక నిలబడ్డ ఆడవాళ్లూ, మగవాళ్లూ, పసి వాళ్లూ, ముసలివాళ్లూ అన్నారు. "రక్తాక్షరాలా!"

"ఔను!" అన్నాయి తలలో మెరిసే కళ్లు. "సర్వ మానవ సౌభ్రాతృత్వం!" అన్నాయి ఆ కళ్ళు.

ఆడవాళ్ళు, మగవాళ్లూ, పసివాళ్లూ, ముసలివాళ్ళూ వెక్కిరించారు. తలలేని మొలతైతక్కలాడింది.

"సర్వం సమానం!" అన్నారు వాళ్ళు. తలలేని మొల నవ్వింది. వాళ్ళ చెవులు చిల్లులుపడ్డాయి.

"నా దృష్టిలోనూ మీరందరూ సమానులే" అన్నది తలి లేని మొల.

"ఆఁ!" అన్నారు వాళ్ళు.

"ఓహో!" అన్నవి కదిలే నీడలు.

"మీరందరూ సమానులే! పెద్ద గుండు సున్నాలు!" అన్నవి ఆ నీడలు. తలలేని మొల భోరున ఏడ్చింది.

రాబ్సన్ పాడాడు. పెరిగే పర్వతాలు నిప్పులు చిమ్మాయి.

ఆ పాడిన పాటల్లో పువ్వులు నవ్వాయి. పెరిగే పర్వ తాలు చెరిగిన నిప్పుల్లోంచి మనుష్యులు నడిచారు. పక్షులు పాడితే ముఖాలు ఫించాలు విప్పాయి.

కదిలే నీడల రూపాలు మెదిలాయి. బ్రహ్మాండం బ్రద్దలైనంత శబ్దమైంది. ఆ శబ్దంలో వియత్తు రొమ్ము విరి చింది. రొమ్ము విరిచిన వియచ్ఛక్తిలోంచి వాయువు వీచింది. వీచిన వాయువు వహ్నిని సృష్టించింది. ఆ వహ్నిలో సర్వ ప్రపంచమూ అట్టుడికినట్లుడికింది. తలలేని మొల నేలకూలింది కుతకుతలాడి కురూపియై నిరాకారి ఐంది. ఆ అనలాల్లోంచి జనసముద్రం కెరటమై వువ్వెత్తున లేచి వూగింది. వూగి లేచిన కెరటాల అంచున పృథివి ఆవిర్భవించింది.

పృథ్వీమధ్య నిటారుగా నిలబడింది. కత్తవనణచే కాలు మీాద కూర్చున్న తల.

"ఎవరు నువ్వు?"

"మానవుణ్ని" అన్నది తల.

"ఏమి టిదంతా!"

"పోరాటం!"

"ఎందుకు?"

"పురోగమనం?"

"అవధి?"

"భవిష్యత్తు!"

"అంటే?"

"స్వాతంత్ర్యం!"

తలవెనుక నిలబడ్డవి బిగించిన పిడికిళ్ళు.

—:o:—